ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023 5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి బ్యాంకర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్టాండప్ ఇండియా పిఎంఇజిపి కింద ముందుకు వచ్చే వారికి రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. స్టాండ్ ఆప్ ఇండియా కింద ఎస్సీలకు 10 లక్షలు లోపు రుణాలు ఇవ్వాలన్నారు. స్టాండప్ ఇండియా, పిఎంఈజిప కింద రుణాలు ఇవ్వడం లేదని కమిటీ సభ్యులు సమావేశం దష్టికి తేగా వివరాలు అందిస్తే పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఏపీఐఐసీ భూముల్లో భూగర్భ జల శాఖ అనుమతి తీసుకున్న తర్వాతే బోర్లు వేయాలని సూచించారు. హిందూపురం పరిధిలోని గొల్లాపురం వద్ద ఉన్న ఫార్మా పరిశ్రమలు రీబోరు వేయకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి తహశీల్దార్, ఆర్డీవోల సహకారం తీసుకొని ఆ పరిశ్రమను తనిఖీ చేపట్టాలన్నారు. సింగల్ డెస్క్ పార్టల్ పెండింగ్ కేసులను గడువులోగా పరిష్కరించాలన్నారు. అభివద్ధి పాలసీ 2022-23 క్రింద 2 క్లైములకు పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయాలని, బీసీ కేటగిరీ కింద 12 క్లైములకు పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు మూలధన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. సులభతర వాణిజ్య విధానం కింద వివిధ శాఖల నుంచి 217 మంది అనుమతులు పొందారన్నారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఫీడ్ బ్యాక్ విషయమై అవగాహన కల్పించాలన్నారు. అందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు చాంద్‌బాషా, పర్యావరణ అధికారి శంకరరావు, విద్యుత్ శాఖ డీఈ మోసేస్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు రమణ కుమార్, ఏపీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ వెంకట మహేష్, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రఘు రాములు, జిల్లా ఫైర్ అధికారి శంకర ప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణ, ఎస్సీ ఎస్టీ పరిశ్రమల జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, ఆహుడ వైస్ ఛైర్మన్ మురళీకృష్ణ గౌడ్, పాల్గొన్నారు.

కూలీకి..

నిలువనీడ లేదాయే..!

◆ ఉపాధి పని ప్రదేశాల్లో కన్పించని టెంట్లు ◆ మండుటెండలో కూలీలు మలమల

◆ మెడికల్ కిట్స్, తాగునీరు కల్పించని పరిస్థితి ◆ ఉపాధి కూలీలపై అడుగడుగునా నిర్లక్ష్యం

భానుడు భగభగమంటున్నాడు. ఇంటినుంచి కాలుతీసి బయటకు వేయాలంటనే భయంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ కూలీలు పొట్టకూటికోసం ఉపాధి పనులకు వెళ్తున్నారు. సూరీడు సుర్రమంటూ శరీరాన్ని ఛిద్రం చేస్తున్నా కుటుంబ పోషణ కోసం మండె ఎండలో కష్టపడుతున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పనిచేసే ప్రదేశంలో టెంట్లు వేసి నీడను ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన జిల్లా వ్యాప్తంగా మచ్చుకైనా కన్పించడం లేదు. ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో ఎక్కడ పరిశీలన జరిపినా ఎండలో పనిచేసే కూలీలే కన్పిస్తారు. పనిచేసి అలసిపోయిన కూలీలు కాసేపు సేదదీరుదామంటే నిలువనీడలేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పనుల పరిశీలనలో భాగంగా శనివారం నాడు ప్రజాశక్తి మడకశిరలోని పలు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ కూలీలకు వసతులు ఏర్పాటు చేయని పరిస్థితులే కన్పించాయి.

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామ సమీపంలోని చెరువు వద్ద అమత సరోవర్ కింద చెరువు నుంచి మట్టిని ట్రాక్టర్ ద్వారా రైతుల పొలాల్లోకి తొలే పనులను చేపట్టారు. దాదాపు ఇక్కడ 120 మంది వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ఇంతమంది పని చేస్తున్న చోట కనీసం తాగడానికి నీళ్లు కూడా ఏర్పాటు చేయలేదు. కూలీలు ఇంటి వద్ద నుంచే బాటిళ్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. తెచ్చుకున్న బాటిల్ నీళ్లు కూడా అరగంటలోనే అయిపోతున్నాయి. ఆ తరువాత చేసేది లేక నోరు తడారిపోతున్నా అలాగే పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు తాగేందుకు నీళ్ల లేకపోవడం, మరోవైపు ఎండనుంచి కాసేపు ఉపశమనం పొందేందుకు నీడలేక కూలీలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మడకశిర మండలంలో 10,586 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 3000 మంది కూలీలకు అధికారులు పనులు కల్పిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పనులు చేస్తున్న ప్రతి చోటా కూలీలు తాగునీరు, వసతి తదితర సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల మేరకు పనిప్రదేశాల్లో కూలీలకు టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్స్ వంటి సదుపాయాల్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధిని క్రమక్రమంగా నిర్వీర్యం చేసే కుట్రలకు పూనుకుంటోంది. అందులో భాగంగా కూలీలకు వసతులు కల్పించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తోంది. పని ప్రదేశంలో వసతులు కల్పించకపోవడం.. బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడం.. సాంకేతిక ఇబ్బందులు.. రెండు పూటలా పని విధానం ఇలా పలురకాల సమస్యలను సృష్టించి ఉపాధిని నీరుగార్చే కుట్ర జరుగుతోంది.

మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామంలో మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూలి తక్కువ ఇస్తున్నారు..

ఉపాధిలో కూలి చాలా తక్కువ ఇస్తున్నారు. నిబంధనల మేరకు రోజుకు రూ.280 వరకు కూలి రావాల్సి ఉండగా రూ.150కు మించి ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే కొలతలు, ఆన్‌లైన్ పేరుతో అధికారులు మాటదాటవేస్తున్నారు. ప్రస్తుతం అన్ని ధరలూ పెరిగాయి. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాలు ఇలా అన్నీ పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలి రేట్లను కూడా పెంచాలి. పని ప్రదేశాల్లో మౌలిక వసతులను కల్పించాలి.

ఆదిలక్ష్మి, ఉపాధి కూలీ,
ఆమిదాలగొంది గ్రామం.

టెంట్లు ఏర్పాటు చేయండి

ఎండలు మండిపోతున్నాయి. ఉపాధి పని ప్రదేశాల్లో నిలువనీడలేక ఇబ్బంది పడుతున్నాం. గతంలో ఎప్పుడూ ఇంత ఎండలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు చేయడం చాలా కష్టంగా ఉంటోంది. పనికి వస్తే తప్పా పూటగడవని పరిస్థితి ఉంది. కూలీల ఇబ్బందులపైనా అధికారులు, ప్రభుత్వం స్పందించాలి. పని ప్రదేశాల్లో తాగునీటి వసతిని ఏర్పాటు చేసి, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలి. ఉపాధి పని దినాలు, కూలీ కూడా పెంచాలి.

వెంకటేష్, ఉపాధి కూలీ,
ఆమిదాలగొంది గ్రామం.

టెంట్లపై ఎలాంటి ఆదేశాల్లేవ్..

ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న మాట వాస్తవమే. ఉపాధి పనిప్రదేశాల్లో టెంట్ల ఏర్పాటుకు సంబంధించి పైఅధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. అందుకే ఎక్కడా వీటిని ఏర్పాటు చేయలేదు. ఉన్నతాధికారులు టెంట్లు ఏర్పాటు చేయాలని సమాచారం ఇస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తాం. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. మధ్యాహ్నంలోపు పనులను పూరి చేయిస్తున్నాం.

శ్రీకాంత్‌గౌడ్,
ఉపాధి హామీ ఎపిఒ.

'ఉపాధి'పై 22న కలెక్టరేట్ వద్ద ధర్నా

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.పెద్దన్న

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.పెద్దన్న పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు 100 రోజుల నుంచి 200 రోజుల పనిదినాలు పెంచాలన్నారు. రోజు కూలి 600 ఇవ్వాలన్నారు. కూలీలకు పనిముట్లు అందజేయాలని కోరారు. ఆన్‌లైన్ మస్టర్‌ను రద్దు చేయాలన్నారు. సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. రెండు పూటల పనిని రద్దు చేసి, ఒక పూటే పని పెట్టాలన్నారు. వారంవారం పేస్లిప్పులు, బిల్లులు ఇవ్వాలని కోరారు. పనిచేసే చోట నీడ, మజ్జిగ, మెడికల్ కిట్లు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు చేపట్టిన మహాధర్నాలో జిల్లా నలుమూలల నుంచి భారీగా కూలీలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న పోలా రామాంజినేయులు

'చేనేత' చట్టం అమలులో పాలకులు విఫలం

◆ ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు

◆ ఆర్డీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పార్లమెంటులో తయారుచేసిన చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలం చెందారని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం కార్మికులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత అన్ని వర్గాల ప్రజలు చేనేత వత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అలాంటి పరిశ్రమ నేడు తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుంటే ఎమ్మెల్యే, ఎంపిలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్‌పై ఉందన్నారు. పరిశ్రమ నేడు కుదేలవుతోందని దీంతో చేనేత కార్మికులు భవన నిర్మాణ కార్మికులుగా, ఆటో డ్రైవర్లుగా మారుతున్నారన్నారు. చేనేత రంగం పరిరక్షణకు పాటుపడాల్సిన కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రిజర్వేషన్ చట్టం గురించి ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్ అధికారులు, కలెక్టర్ మాట్లాడలేకపోతున్నారన్నారు. చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ. లక్ష ఇవ్వాలని, ఇళ్లు కట్టించాలని, బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలపై జూన్ 9వ తేదీ అమరావతిలోని కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ధర్నాలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆదినారాయణ, అయూబ్ ఖాన్, ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, చేనేత కార్మిక సంఘం నాయకులు చౌడప్ప, హరి, అన్నం సూరి, వెంకటస్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారుల కన్నెర్ర

◆ 'పురం' మున్సిపల్ కార్యాలయం వద్ద కాయగూరలు పారేసి నిరసన ◆ పాలకవర్గం తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో కాయగూరల వ్యాపారులు కన్నెర్ర చేశారు. మున్సిపల్ పాలకవర్గం తీరును నిరసిస్తూ పురపాలక సంఘం కార్యాలయం వద్ద శనివారం ఉదయం కూరగాయాలను పారబోసి నిరసన తెలిపారు. పాలకవర్గంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ అసోసియేషన్ గౌరవ అద్యక్షులు చాంద్‌బాషా, అధ్యక్షులు షనావాజ్, కార్యదర్శి రహీంలు మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న కూరగాయాల మార్కెట్‌ను గత ప్రభుత్వం శిథలం పేరుతో తొలగించిందన్నారు. ఆ సమయంలో అందరికీ న్యాయం చేస్తామని చెప్పి తాత్కాలిక మార్కెట్‌ను పట్టణంలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేశారన్నారు. కరోనా నేపథ్యంలో అక్కడి నుంచి ఎంజిఎం మైదానంలోకి మార్చారని చెప్పారు. టిడిపి అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. ప్రత్యేక గెజిట్‌ను విడుదల చేసి, మార్కెట్ పరిసరాల పరిధిలో 2 కిలో మీటర్ల మేర తోపుడు బండ్లు లేకుండా చూస్తామని, వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. సౌకర్యాలు కల్పిసారన్న నమ్మకంతో రూ.16కోట్లు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి నూతన మార్కెట్‌లో ఎ, బి బ్లాకులను అద్దెకు తీసుకున్నట్లు చెప్పారు. అయితే మున్సిపాల్టీ అక్కడ సౌకర్యాలు కల్పించలేదన్నారు. దీనికితోడు పక్కన ఉన్న పురపాలక ఖాళీ స్థలాన్ని హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయిస్తామని మాటను ఇప్పటి వరకు నిలుపుకోలేదన్నారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న తోపుడు బండ్లను సైతం ఖాళీ చేయించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు అద్దెకు తీసుకున్న గదులకు సైతం అద్దెలు చెల్లించిన దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ లెటర్ ప్యాడ్‌తో ఆరు నెలలు క్రితం లేఖ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు దీనికి అతీగతిలేదన్నారు. కౌన్సిల్‌లో తమ సమస్యను అజెండాగా పెట్టి పరిష్కరిస్తామని చెప్పడం తప్పా ఆచరణలో చేసింది శూన్యం అన్నారు. తమకు స్థలాన్ని కేటాయించి, న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని వ్యాపారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న వ్యాపారుల వద్దకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ వచ్చి అందరికీ న్యాయం చేస్తామని ఆందోళన విరమించాలని కోరారు. అయితే వ్యాపారులు వెంటనే సమావేశాన్ని ఏర్పాటు కూరగాయల వ్యాపారులకు స్థలం కేటాయించే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రశక్తే లేదని తెల్చి చెప్పారు. చివరకు వైస్ ఛైర్మన్ జబీవుల్లా అక్కడికి వచ్చి వచ్చే సమావేశంలో ఈ అంశాన్ని పెట్టి న్యాయం చేస్తామని, ఆందోళన విరమించాలని కోరారు. దీనికి వ్యాపారులు ఒప్పుకోలేదు. ఇలా దాదాపు మూడు గంటలకు పైగా ఆందోళన కొనసాగింది. చివరకు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఫోన్ చేసి వ్యాపారులతో మాట్లాడారు. హోల్‌సేల్ వ్యాపారులకు స్థలాలను కేటాయించే విధంగా చూస్తామని, ఈ నెల 30న జరిగే కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం వచ్చే విధంగా చూసి, అందరికి స్థలాలను కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు రఫీక్, బాల, జిపికె మంజు, రిజ్వాన్, బాబా, నస్రూ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో కూరగాయలను పారబోస్తున్న వ్యాపారులు

వైస్ ఛైర్మన్ జబీవుల్లాతో వాదిస్తున్న మార్కెట్ వ్యాపారులు

రూ.100 స్టాంప్ పేపర్ల కొరత

రిజిస్ట్రేషన్లకు అవస్థలు - వినియోగంలో ఈ స్టాంపులు

ప్రజాశక్తి-అమడుగూరు

రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాప్ పేపర్ల కొరత తీవ్రం అవుతోంది. ఒకరంగా స్టాంప్‌పేపర్లు భవిష్యత్తులో కనుమరుగు అవుతాయన్న విధంగా చర్చ నడుస్తోంది. రూ.100 విలువ గల జుడీషియల్ స్టాంపులు ఇటీవల సబ్‌రిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదు. కార్యాలయంలో ఇవి లేకపోవడంతో బయట దళారులు వాటిని ఏదో రూపంలో తెచ్చుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వంద రూపాయల స్టాంపులను రూ.500కు విక్రయిస్తున్నారు. ఒక్కా సారిగా ప్రభుత్వం 100 రూపాయల స్టాంపుల సరఫరా నిలిపేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వీటి స్థానంలో ఈ స్టాంపులను వినియోగించాలని ఆదేశాలు ఇచ్చింది. వీటి గురించి పెద్దగా అవగాహన లేని ప్రజలు వాటిని తెచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 100 రూపాయల స్టాంపులు కోసం నిత్యం వందలాది మంది మంది ప్రదక్షిణలు చేస్తుంటారు. ఈ స్టాంపులు పైనుంచి రావడం లేదంటూ అధికారులు పేర్కొంటున్నారు.

రూ.100 స్టాంప్‌లు రావడం లేదు...

గత కొంతకాలంగా రూ.100 రిజిస్ట్రేషన్ స్టాంపులు రావడం లేదని కదిరి సబ్ రిజిస్ట్రార్ శిరీష భరత్ తెలిపారు. కార్యాలయంలో ఇప్పటి వరకు స్టాకు ఉన్న 100 రూపాయల స్టాంపులను ఇచ్చేశామన్నారు. కార్యాలయం అవసరానికి అనుకూలంగా కొద్దిగా ఉండొచ్చని, వాటిని కూడా ప్రజలకు ఇచ్చేస్తామన్నారు. గత కొన్ని రోజుల క్రితమే వంద రూపాయల స్టాంపులు కావాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. అయితే అవి నేటికీ రాలేదన్నారు. ప్రజలు కూడా సులభమైన ఈ స్టాంపు విధానంను అలవాటు చేసుకోవాలని సూచించారు. కదిరి పట్టణంలో ఈ స్టాంపు వినియోగించేలా మీసేవా కేంద్రాలకు అనుమతులు ఇచ్చామన్నారు. పూర్తిస్థాయిలో ఈ స్టాంపు వినియోగంలోకి వస్తే ప్రజలు, అధికారులకు ఇబ్బందులు ఉండవు. నాన్ జుడీషియల్ స్టాంపులు ఏ విధంగా విక్రయిస్తున్నారో ఈస్టాంపు విధానాన్ని కూడా స్టాంపు వెండర్లు విక్రయించుకోవచ్చునని సూచించారు. వీటిని ఎవరైనా కతిమ కొరతను సష్టించి అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతర పర్యవేక్షణ : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి జిల్లాను ఆనుకొని కర్నాటక ప్రాంతం ఉన్నందున అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణలో ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సెబ్ అధికారుల కు సూచించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఎస్పీ జిల్లాలోని సెబ్ అధికారులతో నెల వారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధ్బంగా ఎస్పీ మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దులు, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సెబ్ చెక్‌పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనంతరం సెబ్ కమిషనర్ నుంచి నుంచి వచ్చిన 12 అప్రిసియేషన్ సర్టిఫికెట్లను సిబ్బందికి అందజేశారు. వారిలో నలుగురు సిఐలు, ముగ్గురు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుల్స్ ఉన్నారు. ప్రజలకు నాటుసారా దుష్పరిణామాలను తెలియజేయాలన్నారు. పెండింగ్ కేసులు, నమోదైన కేసులు, సీజ్ చేసిన వాహనాలు, తదితర విషయాలను స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాల పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే మద్యం, నాటుసారా, ఇసుక, గేమింగ్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లా పరిధిలో ఎక్కడా గుట్కా కేసులు నమోదు చేయరాదని తెలిపారు. పాత నేరస్తులు మళ్లీ నేరాలకు పాల్పడితే బైండోవర్ చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి కలిసి పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సెబ్ అధికారి కెవి రామకష్ణ ప్రసాద్, జిల్లాలోని సెబ్ సి.ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు : డిఎం

కదిరి టౌన్: ఈ నెల 29న శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ కేంద్రంలో జి.ఎస్.ఎల్.వి-12ను ఇస్రో సంస్థ అంతరిక్షంలోకి పంపుతున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించుటకై కాలేజీలు, స్కూళ్ల విద్యార్థులు, ఆసక్తి ఉన్న వారి కోసం ఈ నెల 28న రాత్రి కదిరి డిపో నుంచి ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కదిరి బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఆధార్ కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏదైనా కాలేజీ/స్కూల్ నుంచి 40 మంది ఉన్నచో వారి ఊరి/కాలేజీకి బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్ లగ్జరీ లో ఛార్జి: రూ. 1,100 అన్నారు. వివరాలకు డిపో మేనేజర్ నెంబరు: 9959225860కి సంప్రదించగలరు.

ఖాద్రీ క్షేత్రంలో భక్తుల రద్దీ

అమడగూరు: సుదూర ప్రాంతాల నుంచి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులతో శనివారం ఆలయం రద్దీగా కనిపించింది. వేసవి సెలవులు, శనివారం కావడంతో ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం కావడంతో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు పాలక మండలి ఛైర్మన్ గోపాలకష్ణ, ఈవో గురుప్రసాద తెలిపారు.

అర్హులకు న్యాయం చేయండి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని సాములపల్లి గ్రామంలో గతంలో పట్టాలు పొందిన అర్హులకు న్యాయం చేయాలని కెవిపిఎస్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం పాలసముద్రం పంచాయతీ పరిధిలోని సాములపల్లి గ్రామంలో ఇంటి స్థలాలను పరిశీలించారు. 1992లో 32 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేయగా చాలామంది ఇల్లు కట్టుకున్నారన్నారు. అయితే ఇల్లు కట్టుకోలేని వారి స్థలాలను ఇతరులు కబ్జా చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా ప్రకారం రెవెన్యూ అధికారులు స్థలాలు చూపించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేషులు, సిఐటియు నాయకులు కొండా వెంకటేశులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు నారాయణస్వామి, పట్టాదారులు, తదితరులు పాల్గొన్నారు.

‘టంగుటూరి’ని ఆదర్శంగా తీసుకోండి

కొత్తచెరువు: విద్యార్థులు టంగుటూరు ప్రకాశం పంతులను ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయాధికారి కె.జయరాం సూచించారు. టంగుటూరి వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ టంగుటూరి నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యనభ్యసించి ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా సేవలు అందించారని కొనియాడారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పాఠకులు మహమ్మద్, ప్రభాకర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నల్లచెరువు: మండల పరిధిలోని పంతులుచెరువు గ్రామానికి చెందిన అంజనప్ప ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తుండేవాడు. 15 రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎంపిడిఒ శకుంతల శనివారం ఉపాధి హామీ సిబ్బందితో కలిసి అంజనప్ప భార్యకు రూ.25,500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మంజుల, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం

ధర్మవరం టౌన్ : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ సర్కిల్‌లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి, ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి చంద్రమోహన్‌బాబు తదితరులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు భగవంతు, రాము, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అవార్డులు

సోమందేపల్లి: వాలంటీర్లు మరింత ఉత్సాహంగా పని చేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ సూచించారు. మండలంలో అత్యుత్తమంగా పని చేస్తున్న వాలంటీర్లకు శనివారం స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కార్యాలయంలో ఎమ్మెల్యే ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ప్రభుత్వం అమలు చేస్తున్న 25 సంక్షేమ పథకాలను నేరుగా ప్రతి గడపకూ వెళ్లి అందజేస్తు న్న ప్రతి వాలంటీర్‌కు అభినందనలు అన్నారు. లంచాలు, రాజకీయ ప్రలోభాలకు తావు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహ మూర్తి, కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి అశోక్, వైసిపి నాయకులు ఎల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉత్తమ సేవా అవార్డులు అందజేసిన ఎమ్మెల్యే శంకర నారాయణ

‘ఉపాధి’ కూలీలకు వసతులు కరువు

ప్రజాశక్తి-రొద్దం

ఉపాధి హామీ చట్టం కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని కోగిర, పాపూరం, తురకలాపట్నం, బొక్సంపల్లి గ్రామాల్లో జరుగుతున్న పని ప్రదేశాలకు వెళ్లి వారి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రింటర్ పనిచేయకపోవడంతో మస్టర్లను బయట ప్రింట్ చేయించుకుంటున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. రోజూ పోను, రాను 16 కి.మీ దూరం నడిచి వెళ్తున్నామని కూలీలు వాపోయారు. అలాగే పలు సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 22న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్

గోరంట్ల రూరల్ : పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడం లేదని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. పాలసముద్రం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పరిశీలించి కూలీలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కూలీలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు అన్నమయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీల డిమాండ్లపై ఈ నెల 22న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేషులు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు , చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

సోమందేపల్లి: మండల పరిధిలోని జూలుకుంట గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేతనం, పని దినాలు, తదితర విషయాలను ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు జరుగుతున్న అన్యాయాలపై ఈ నెల 22న కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాకు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. అనంతరం సంబంధిత డిమాండ్లతో ఉన్న వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కూలీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రొద్దం: మండల కేంద్రంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో రొద్దం సమీపంలో మారెమ్మ దేవాల యం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరిగి మండలం ఇట్టాపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. పావగడ వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఈశ్వర్ గుడి వద్ద నీటి ట్యాంకును వేగంగా వచ్చి తగిలాడు. దీంతో ద్విచక్ర వాహనం ట్యాంకు కిందకు వెళ్లగా అతను ట్యాంకుకు తగలడంతో తలకు గాయాలైనట్లు తెలిసింది. దీంతో అతనిని పెనుకొండ ఆసుపత్రి కి తరలించి అక్కడి నుంచి బెంగళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలపారు. విషయం తెలుసుకొన్న ఎస్ ఐ నాగస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించి బైక్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

బాటసుంకలమ్మ ఆలయంలో హుండీ చోరీ

రొద్దం: మండల పరిధిలోని రొద్దం-హిందూపూరం ప్రధాన రహదారిలో కల్లకుంట వద్ద వెలసిన బాట సుంకలమ్మ ఆలయంలో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. గ్రామస్తులు తెలపిన వివరాలు.. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఎలక్ట్రానిక్ వస్తువులతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఆలయంలో ఇప్పటివరకు నాలుగు సార్లు చోరీ జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : బికె

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. మొత్తం 37,150 మంది ప్రశ్నపత్రాలు నింపి వారి సమస్యలను మా దష్టికి తీసుకరొచ్చారన్నారు. ప్రజలు, మహిళలకు రక్షణ లేదన్నారు. తప్పుడు హామీలతో ప్రజలను, జాబ్ క్యాలండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. అనధికార విద్యుత్ కోతలను ఆపి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటు అని సాక్షి మీడియా తెలిపి, పోలీసులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. ఆ తరువాత సిబిఐ విచారణ లో ఎంపి అవినాష్ రెడ్డి నిందితుడు అని ఈ హత్య కేసులో అప్రూవల్‌గా మారిన వారు తెలిపా రన్నారు. అనంతరం దళిత ద్రోహి జగన్‌రెడ్డి, దళిత బాంధవుడు-పేదల పెన్నిధి చంద్రన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, సీనియర్ నాయకులు రామకష్ణప్ప, కేశవయ్య, పాలడుగు చంద్రశేఖర్, హుజూర్, లక్ష్మీనారాయణ రెడ్డి, అత్తరు ఖదిర్, సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన శ్రీచైతన్య పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమెండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ. 20 వేల నుంచి రూ. 40వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థులకు క్రీడ మైదానం, మౌలిక సదుపాయాలు సరిగా కల్పించడం లేదన్నారు. విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విద్యాసంస్థలతో విద్యాశాఖ అధికారులు మామూళ్లు తీసుకుని వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆయా విద్యాసంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేపడుతామని, అందుకు విద్యాశాఖ అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జై చంద్ర, నిహాల్, మనీ, లిఖిత్, రోహిత్, ప్రసన్న, దాదు, ముస్తాక్, ఫర్దిన్, ఆదిల్, షాహిద్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు..?

పూలకుంట సర్పంచి మంజూనాథ్

ప్రజాశక్తి-హిందూపురం

పాలక వర్గం ఏర్పడిన పుటి నుంచి ఐదు సమావేశాలు జరిగాయి.. మొదటి సమావేశం నుంచి సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదు.. ఇలాంటి సమావేశాలు ఎందుకని పూలకుంట సర్పంచి మంజునాథ్ ప్రశ్నించారు. ఎంపిపి రత్నమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సభ ప్రారంభమైన 5 నిమిషాల్లోనే ఎంపిపి సభలో నుంచి వెళ్లి పోగా వైస్ ఛైర్మన్ సభలో ఉన్నప్పటికి జెడ్పీటిసి నాగభూషణం అధ్యక్ష స్థానంలో కుర్చొని సభను నడిపించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు వారి శాఖలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. వివిధ పంచాయితీల్లో జగనన్న లే అవుట్‌లో విద్యుత్ సౌకర్యం కల్పించలేదని పలువురు ఎంపిటిసిలు అన్నారు. పూలకుంట సర్పంచి మంజూనాథ్ మాట్లాడుతూ తమ పంచాయితీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమెండ్ చేశారు. సమావేశంలో ప్రత్యేక అధికారి చంద్రమౌళిరెడ్డి, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, ఈఓఆర్‌డి నటరాజ్, హౌసింగ్ డిఈఈ శివకుమార్ నాయక్, ఎఈ పెంచలయ్య, ఇరిగేషన్ డిఈఈ యోగేంద్ర, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమస్యను వివరిస్తున్న పూలకుంట సర్పంచ్ మంజూనాథ్

స్టేడియాన్ని గెస్ట్ హౌస్‌గా మార్చారు : పరిటాల సునీత

ప్రజాశక్తి-రామగిరి

టిడిపి హయాంలో రామగిరిలో రూ. 2.20 కోట్ల వ్యయంతో పరిటాల రవీంద్ర గ్రీన్ ఫీల్డ్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, జిమ్, పెవిలియన్, కాంపౌండ్ నిర్మిస్తే వైసిపి ప్రభుత్వం అధికారుల గెస్ట్ హౌస్‌గా మార్చిందని మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం గ్రీన్ ఫీల్డ్ స్టేడియం నుంచి సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా ఎమ్మెల్యేకి సూటిగా ప్రశ్నల వర్షం కురిపించారు. రామగిరి ప్రాంతంలో విద్యార్థుల కోసం ఎలాంటి క్రీడా మైదానాలు లేని పరిస్థితుల్లో తాము రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో ఈ స్టేడియం నిర్మించామన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని నిరుపయోగంగా మార్చేశారని మండిపడ్డారు. జిమ్ పరికరాల్లో కొన్నింటిని దొంగలు ఎత్తుకెళ్లగా మరికొన్ని నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. ఇండోర్ స్టేడియం ఎందుకూ పనికిరాకుండా పోయిందన్నారు. క్రీడాకారుల కోసం నిర్మించిన గదుల్లో ముగ్గురు అధికారులు అనధికారికంగా నివాసం ఉంటున్నారన్నారు. అసలు ఈ స్టేడియం ఎవరి కోసం నిర్మించారు.. దాని ఉద్దేశం ఏంటి అనే విషయాలను పూర్తిగా విస్మరించారన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి స్టేడియం నిర్మిస్తే ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి దీనిని పూర్తిగా నిరుపయోగంగా మార్చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అందరికీ ఇల్లు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ, నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అమ్యూనిటీ సెక్రటరీలను ఆదేశించారు. పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను శనివారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను, నిర్మాణ పనులకు అవసరమైన సిమెంట్ ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయా, లేదా అని తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా, గడువులోగా పూర్తయ్యేలా వేగవంతంగా చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. దీంతో పాటు థర్డ్ ఆప్షన్ కింద నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు పనులు పూర్తి అయిన వెంటనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, వార్డు సెక్రటరీలు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై తెలుసుకుంటున్న కమిషనర్

ప్రశాంత వాతావరణం కల్పించాలి : డిఎస్‌పి

లేపాక్షి : మండలంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని హిందూపురం డిఎస్‌పి కంజాక్షన్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మండల పరిధిలోని ఏ గ్రామంలోనూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలను పసిగట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచిం చారు. అలాగే సిబ్బందితో కాఫీ అనే కార్యక్రమంలో మహిళా పోలీసులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. సమావేశంలో రూరల్ సిఐ వేణుగోపాల్, సబ్ ఇన్‌స్పెక్టర్ మునీర్ అహమ్మద్, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కంజాక్షన్

ఆర్‌బికెలో పేర్లు నమోదు చేసుకోండి

రొళ్ల : విత్తన వేరువనగ తీసుకునేందుకు రైతులు స్థానిక ఆర్‌బికెలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎం.రాయపురం గ్రామ సచివాలయ సిబ్బంది కష్ణమూర్తి తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్ తీసుకొని ఆర్‌బికెలలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక బ్యాగు రూ. 1,675 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలన

నల్లచెరువు: నల్లచెరువు 1, 2 రైతు భరోసా కేంద్రాలకు శనివారం చేరిన విత్తన వేరుశనగ కాయల నాణ్యతను మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ముస్తఫా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తన కాయలు అందించాలని అధికారులకి సూచించారు. మండలానికి 2,700 క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటి వరకు 567.70 క్వింటాళ్ల కాయలు వచ్చాయని ఎఒ భారతి తెలిపారు. వారితో పాటు విహెచ్‌ఎలు షాజాద్, భాస్కర్‌నాయక్, రైతులు ఉన్నారు.

ఉత్తుత్తి సమావేశాలు ఎందుకు..?

లేపాక్షి : గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయలేనప్పుడు ఉత్తుత్తి సమావేశాలు ఎన్ని నిర్వహించినా ప్రయోజనం లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు ముందుకెళ్తాయన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా మాట్లాడారు. పొలాలకు మట్టి తోలుకు నేందుకు ప్రతి రైతుకు అనుమతులు మంజూరు చేయాలని లేపాక్షి సర్పంచి ఆదినారాయణ కోరారు. బయన్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఎంపిటిసి కోరా రు. ఉపాధి హామీ కింద పెట్టిన మొక్కలకు రెండేళ్ల బిల్లులు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని కొందరు సభ్యులు సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఎంఈఓ నాగరాజు నాయక్, విద్యుత్ ఏ ఈ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకట చిరంజీవి, రాధిక, హనుమ నాయక్, శ్రీలత, వాసంతి, ఎంపీటీసీలు లలితమ్మ, సర్పంచిలు ఆది నారాయణ, మంజునాథ్, వసుంధర, నందిని, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం పాల్గొన్న ఎంపిపి వెంకటరత్నమ్మ

మోడల్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్: పట్టణంలోని గుట్టకిందపల్లిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ అండ్ ఇంటర్మీడియట్ కళాశాలలో మొదటి సంవత్సరము కోసం ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పద్మశ్రీ శనివారం తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఈసి గ్రూపులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉంటాయన్నారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ. 150, ఓసి, బీసీలకు రూ. 200 అన్నారు. ఉచిత విద్యతో పాటు కళాశాలలో బోధన మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాలు మెరిట్, రిజర్వేషన్స్ రూల్స్ ప్రకారం ఉంటాయని తెలిపారు.

బాధితుడికి పశుగ్రాసం అందజేత

ఓబుళదేవరచెరువు: ఒడిసి మండల కేంద్రంలోని పగడాలవారిపల్లి గ్రామానికి చెందిన పూజారి రమణప్పకు శనివారం టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ట్రాక్టర్ వేరుశనగ పశుగ్రాసం పంపించారు. గతవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టడంతో ఆదినారాయణ సొంత ఖర్చుతో ట్రాక్టర్ పశుగ్రాసం పంపించినట్లు రమణప్ప తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కష్ణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు రాజగోపాల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కొత్తచెరువు: కొత్తచెరువు సమీపంలోనే ధర్మవరం రోడ్డు పక్కన మధ్యప్రదేశ్‌కు చెందిన సంచార జాతి కార్మికులు నివాసం ఉంటున్నారు. వారికి శనివారం పిఆర్‌డిఎస్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి సౌత్‌ఆఫ్రికా దేశానికి చెందిన మీనా అవిను ఆర్థిక సహాయంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 28 మందికి 5 కేజీల గోధుమపిండి, నూనె, కూరగాయలు, బిస్కె ట్లు, చాక్లెట్లు, తదితర వాటిని అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి, ఎల్లమ్మ, చెన్నరాయుడు, పావని, సుధాకర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతుకు విత్తు కష్టాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలోనే నూనెగింజెల పంటల సాగులో అనంతపురం జిల్లా అగ్రభాగాన ఉంటుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని నిలబడే పంట వేరుశనగ. కొన్ని దశాబ్దాలుగా ఈ పంటనే ఇక్కడ ప్రధానమైనదిగా ఉంటూ వస్తోంది. రాష్ట్రంలో 90 శాతం వేరుశనగ పంట ఒక్క అనంతపురం జిల్లాలోనే పండుతుంది. అయితే ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, అంతర్జాతీయంగా వంట నూనెల దిగుబడుల కారణంగా గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో పంట సాగు చేసే రైతుకు నష్టాలు మిగులుతున్నాయి. దీంతో ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారు. దీనిపై దేశవ్యాప్తంగానే చర్చ జరుగుతోంది. అత్యల్ప వర్షపాతమూ, అతి తక్కువ నీటి వసతి ఉన్న ఈ ప్రాంతంలో పండేందుకు అనువైన పంటగా ఇది ఉండటంతోనే రైతులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ప్రారంభంలో పంట సాగుకు అవసరమైన విత్తనాన్ని ప్రభుత్వం సబ్సిడీతో తక్కువ ధరకు అందిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. అయితే పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధరలేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు తరచూ దెబ్బతింటున్న కారణంగా రైతులకు క్రమంగా జిల్లాలో వేరుశనగ సాగుపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లలో 23 లక్షల ఎకరాల వరకు సాగెయ్యేది. అలాంటిది ఇప్పుడు 12 నుంచి 13 లక్షల ఎకరాలకు పడిపోయింది. పంటల్లో వరుసగా నష్టాలకు ప్రకృతి వైపరీత్యాలు ఒక ఎత్తవుతే... విత్తన నాణ్యత, కొత్త వంగడాలు లేకపోవడంతో వేసిన రకాలే వేయడం మరో కారణంగా నష్టాలు మిగుల్చుతున్నాయని చెప్పవచ్చు. ఇందులో ప్రభుత్వమిచ్చే విత్తనమైన నాణ్యంగా ఉంటుందా అంటే అది లేకుండాపోతోంది. దీంతో విత్తన పంపిణీ ఒకప్పుడు జిల్లాలో ఐదు లక్షల క్వింటాళ్ల వరకు ఉండేది. ఇప్పుడు 1.70 లక్షల క్వింటాళ్లకు తగ్గిపోయింది. ఈ విత్తనాన్ని కూడా కొనేందుకు ముందుకు రావడం లేదు. ఎందుకంటే ప్రభుత్వమిస్తున్న విత్తనాల్లో నాణ్యత ప్రశ్నార్థకం అవుతోంది. ఎందుకంటే గతంలో ఇచ్చే విత్తనాల్లో కొంత భాగమైన సర్టిఫైడ్ విత్తనం ఉంటూ వచ్చేది. దీంతో కొంత వరకు నాణ్యమైన విత్తనం లభించేది. కాని ఇప్పుడు ఇస్తున్న విత్తనం పూర్తిగా ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్. దీని సేకరణ కూడా పూర్తిగా ప్రయివేటు వ్యాపారుల నుంచి ఉంటోంది. మిల్లుల్లో సేకరించిన విత్తనాన్ని ప్రాసెసింగు చేసి, జర్మినేషన్ టెస్టు చేసి రైతులకు అందజేస్తున్నారు. అయితే ఇందులో విత్తన నాణ్యత ఏ పాటిదన్నది ప్రశ్నార్థకమే అవుతోంది. మొలకెత్తే వరకు ఉంటున్నా దిగుబడులు ఏ రకమన్నది అనుమానంగానే ఉంటోంది. దీంతో రైతులు సబ్సిడీ విత్తనం కంటే బయటే నేరుగా రైతులతో చూసి కొనుగోలు చేస్తుకుని విత్తనం వాడుతున్నారు. ప్రభుత్వం అందించే విత్తన కొనాలంటే ఇప్పుడున్న విధానంలో ముందుగానే రైతు తన వాటా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. విత్తనం నచ్చకపోతే అది తిరిగిస్తే డబ్బులు తిరిగి ఎప్పుడు వస్తాయో లేక విత్తనమే తిరిగి ఎప్పుడు అందుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది విత్తన పంపిణీకి రంగం సిద్ధమైంది. అయితే విత్తన నాణ్యతపై మాత్రం అనేక ఆరోపణలు వెల్లువెత్తుతతున్నాయి. ట్రూత్‌ఫుట్ లేబుల్డ్‌లో ఎంత మేరకు విత్తన నాణ్యత ట్రూత్‌ఫుల్‌గా ఉంటుందన్న సందేహాలు నెలకొన్నాయి. అధికారులు మాత్రం మంచి విత్తనాన్ని అందిస్తామని చెబుతున్నారు. కాని విత్తన సేకరణ మాత్రం మొత్తం ప్రయివేటు వ్యాపారులపై ఆధారపడటంతో దీనిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. వచ్చే వారం నాటికి పంపిణీని ప్రారంభించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా వేరుశనగ రైతుకు మాత్రం కష్టాలు, నష్టాలు తప్పడం లేదు.

‘ఉపాధి’ కూలీలు బీమా చేసుకోవాలి

ఓబులదేవరచెరువు: ఉపాధి హామీ కూలీలు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద బ్యాంకులో రూ. 20 చెల్లించి బీమా చేసుకోవాలని ఎంపిడిఒ పోలప్ప సూచించారు. ఆయన మాట్లాడుతూ ఈ బీమా పొందిన కూలీలకు ప్రమాదవశాత్తూ అంగవైకల్యం జరిగితే రూ. లక్ష, చనిపోతే రూ. 2 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కావున ఉపాధి కూలీల చేత బ్యాంక్ అకౌంట్ కలిగిన బ్యాంకులో ఈ బీమా చేయించాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. 18-70 సంవత్సరాల వయస్సు వారు బ్యాంకులో పేరు నమోదు చేయించుకుని ఆ బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం అయి ఉండాలన్నారు.

నిరుపయోగ వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అందించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో నివాసం ఉంటున్న ప్రజలు నిరుపయోగంగా ఉన్నా వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రానికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. పురపాలక సంఘం తరఫున ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని శనివారం కమిషనర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ వారు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ్ షెహెర్ కార్యక్ర మంలో భాగంగా పురపాలక సంఘంలో రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్ ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను పట్టణంలోని ముక్కడిపేట, సిపిఐ కాలోని, రవీంద్ర భారతీ స్కూల్ ఎదురుగా, జూన్ 5వ తేదీ వరకు ఇళ్లలో ఉన్న నిరుపయోగ వస్తువులను సేకరిస్తారన్నారు. సేకరించిన వాటితో పునర్వినియోగం, పునరుద్ధరణ, కొత్త ఉత్పత్తికి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నెట్టికల్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the Senior Civil Judge & J.M.F.CAT Pavagada

M.C.No:19/2022

Between:

Saikrishnaveni ...Petitioner

V/s

G.Girisha ...Defendants.

Paper Publication

WHEREAS, The Petitioner has filed the above petition, seeking is she of paper Publication Respondent G.Girisha S/o Golla Lakshmaiah, aged about 41 years, R/O Darga Road, Penukonda Town, Sathyasai Dist, Andhra Pradesh Now.

The Matter is set down for notice I Petition Summons to Respondent who ever got any objection appear in this case same on the date of hearing i.e 29-05-2023 you one hereby called upon to appear before court at 11 AM on the said date of hearing either in person or through your counsel if you fail to appear this court, The matter will be heard and decided exparte,

Given under my hand and seal of the court this day of 14-03-2023.

(By order of the Court)

R.T. Mallikarjunaiah
Advocate for Plaintiff
Pavagada.

ఎమ్మెల్యేను కలిసిన ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణని శ్రీసత్య సాయి జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన (జర్నలిస్ట్) ఎస్.రవూఫ్‌ను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సమీవుల్లా, జిల్లా మైనారిటీ అధ్యక్షులు కడియాల సిరాజుద్దిన్, నియోజకవర్గం అధ్యక్షులు శేషయ్య, జిల్లా యువజన అధ్యక్షులు మోహన్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, మునిసిపల్ ఛైర్మన్ ఉమర్ ఫారూక్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

మడకశిర రూరల్ : ప్రభుత్వం అమరావతిలో 50 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇల్లు సౌకర్యం కల్పిస్తుంటే చంద్రబాబు పేదలపై నిర్లక్ష్యంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఎమ్మెల్యే ఈరన్న తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, దళితులే రానున్న ఎన్నికల్లో టిడిపికి గుణపాఠం చెప్పి ఇంటికి పంపిస్తారన్నారు. టిడిపి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి సిఎంను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. దళితులను అవమానించడం గుండుమాలకు అలవాటుగా మారిందన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -పెనుకొండ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నగర పంచాయతీ పరిధిలో “మేరే లైఫ్ మేరే స్వచ్ఛ సేహార్” కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రియూస్, రీసైకిల్ సెంటర్ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని 1వ వార్డు సచివాలయం నందు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమర్ ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ మాట్లాడుతూ పట్టణంలోని వెంకటరెడ్డి పల్లి, కోనాపురం వార్డ్ సచివాలయం నందు ఆర్ ఆర్ ఆర్ సెంటర్‌లు ఏర్పాటు చేశారని, ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేది వరకూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సెంటర్లలో ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని అందిస్తే వాటిని అవసరం ఉన్న ఇతరులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ సునీల్, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోస్టర్ విడుదల

ఓబుళదేవరచెరువు: ఆటో డ్రైవర్ల సమస్యలపై శనివారం సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, కార్యదర్శి శ్రీరాములు, జిల్లా నాయకులు వివి.రమణ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై పోలీసుల వేధింపులు ఆపాలని, 290 జీవోను, అక్రమంగా వేస్తున్న ఈ చలానాలను రద్దు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆటో డ్రైవర్ల పై ప్రస్తుతం ఉన్న ఈ చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు మహబూబ్ బాషా, రమేష్, మారప్ప, నరసింహులు, గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పరిశీలన

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న వ్యవసాయ గిడ్డంగి వద్ద శనివారం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను మండల స్పెషల్ అధికారి మోహన్‌రావు, ఎంపిడిఒ డి. అంజనప్ప, ఏవో లక్ష్మి ప్రియ, ఎంపిపి తాతం జగన్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేస్తామని తెలిపారు ప్రస్తుతం గాండ్లపెంట సచివాలయానికి వంద క్వింటాళ్లు, మల్లమీదపల్లి సచివాలయానికి వంద క్వింటాళ్లు వచ్చాయన్నారు. గాండ్లపెంటకు వచ్చిన కాయలు నాణ్యతగా లేకపోవడంతో వెనక్కి పంపించినట్లు తెలిపారు. వారితో పాటు ఏపిఎం సూర్యనారాయణ, రవీందర్ రెడ్డి, సిబ్బంది కష్ణమోహన్, సచివాలయ సిబ్బంది రియాజుద్దీన్, రైతులు ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న సిఎం జగన్

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

పత్రికా స్వేచ్ఛను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ అవినాష్‌రెడ్డి ఎంపీనా లేక వీధిరౌడీనా అని ప్రశ్నించారు. వాస్తవాలను వెలికి తీసి, నిజాలను నిర్భయంగా ప్రసారం చేస్తున్న మీడియా ప్రతినిధులపై అవినాష్‌రెడ్డి రౌడీలు దాడి చేయడం దుర్మార్గం అన్నారు. దాడికి తెగబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణకు హాజరు కాకుండా కుంటి సాకులు చెప్పి పారిపోతున్న అవినాష్ రెడ్డి బాగోతాన్ని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై వైసీపీ గూండాల దాడి చేయడం దారుణం అని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేంద్రనాయుడు, మావుటూరు గోపాల్ ,ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మంజునాథ్,మాజీ ఎంపీటీసీ ముద్దన్న,చిన్నపోతన్న, నాగేంద్రప్ప, వీరచిన్న,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రతి 50 ఇళ్లకు ఒక సెక్షన్ ఇన్‌ఛార్జిని నియమించుకుని పార్టీ బలోపేతాని కి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం పట్టనంలోని 27, 28 వార్డులకు సబంధించిన కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పాలనలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు తప్పా అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదన్నారు. మనం పోరాడుతోంది అవినీతి పార్టీతో అన్నారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వైసిపి అవినీతి, అరాచకాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. రాబోవు ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పురుషోత్తంగౌడ్, బోయరవిచంద్ర, నాగూర్ హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, బొట్టు కిష్ట, బీరే శ్రీనివాసులు, పఠాన్ బాబూఖాన్, పూలకుంట మహేశ్, ఇమాం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య

విద్యార్థులకు అన్నదానం

హిందూపురం : పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న మార్గదర్శి పాఠశాలలో ఉచిత వేసవి బడి విద్యార్థులకు బి.ఇందిరమ్మ, బి.రాములు దంపతులు శనివారం అన్నదానం చేశారు. అంతకుముందు ఉచిత వేసవి బడి నిర్వాహకులు కె.మాళప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాతలు ఇందిరమ్మ, శ్రీరాములు దంపతులకు షష్టిపూర్తి సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అన్నదానం చేసిన కుటుంబ సభ్యులు లావణ్య శ్రీధర్, కళావతినటరాజ్, శశిధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాద్యాయులు గాంగాధర్, శ్రీశైలం, కుమారి, మమత తదితరులు పాల్గోన్నారు.

అన్నదానం చేసిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

మండల పరిధిలోని డబురవారిపల్లి పంచాయతీ కుంటలో జరుగు తున్న అమృత్ సరోవర్ పనులను, ఓబుళదేవరచెరువులో చెరువు దగ్గర జరుగుతున్న పనులను శనివారం డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ పని చేసి ఎక్కువ వేతనం పొందాలని సూచించా రు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి కూలీలకు నీడ, నీరు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. కూలీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపిడిఒ పోలప్ప, ఏపీడీ రఘునాథ్ రెడ్డి, ఉపాధి ఎపిఒ సోమశేఖర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు రాజారెడ్డి, హనుమంతురెడ్డి, రాజేంద్రయాదవ్, ఎపిడి సహాయకులు ప్రతాపరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అమృత్ సరోవర్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి

దంపెట్ల ఇసుక రీచ్ అనుమతి రద్దు చేయాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

చిత్రావతి పరీవాహక ప్రాంతాలైన ఉప్పర్లపల్లి-దంపెట్ల గ్రామాల మధ్య ఇసుక రీచ్ అనుమతిని వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో చిత్రావతి నది నుంచి ఇసుక టిప్పర్లను కదలనీయమని మండల టిడిపి నేతలు హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్రనాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాలైన ఉప్పర్లపల్లి, దంపెట్ల, గరిశనపల్లి, డి.చర్లోపల్లి, ఓబులాపురం, కోడెకండ్ల, జ్వాలాపురం, రామాపురం తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైబడి ఆయకట్టు సాగవుతోందన్నారు. అయితే నదిలో ఇసుక తరలించడం వల్ల ఫిల్టర్ బావులు ఎండిపోయి రైతులు పంటలు నష్టపోతున్నారన్నారు. రాబోవు రోజుల్లో తాగు, సాగునీటికి కష్టాలు తప్పవన్నారు. దీనికి తోడు సామాన్య ప్రజలు ఇంటి అవసరాలకు ఎద్దుల బండ్లలో ఇసుక తీసుకువెళ్తే కేసులు నమోదు చేస్తున్న పోలీసులు టిప్పర్ల యజమానులపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే దంపెట్ల ఇసుక రీచ్ అనుమతిని రద్దు చేయాలని, లేనిపక్షంలో నదీ పరివాహక ప్రాంతాల రైతులతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రామాపురం కేశవ, దంపెట్ల వెంకటనాయుడు, గరిశనపల్లి రవి, ఉప్పర్లపల్లి చిదంబరెడ్డి, బాలాంజనేయులు యాదవ్, ప్రసాద్, లింగారెడ్డిపల్లి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారంపై హర్షం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కర్ణాటక ముఖ్యమంత్రిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల జిల్లా కురుబ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం చిత్రావతి ఘాట్ వద్ద ఆ సంఘం నాయకుడు సామ కోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక సామాన్య కురుబ కుటుంబంలో జన్మించి మాస్ లీడర్‌గా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం ప్రశంసనీయమన్నారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి రెండవసారి ముఖ్యమంత్రి కావడం విశేషం అన్నారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు పొంది పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కర్ణాటకలో ఆయనకు మాస్ లీడర్ గా మంచి పేరు ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కురుబ సంఘం తరపున సిద్ధరామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు కేసాని ఆదినారాయణ, కమ్మన్న, గోరంట్ల క్రిష్టప్ప, జనార్ధన్, కర్ణాటక నాగేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కురుబ సంఘం నాయకులు